www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్



రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించబడే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను నవంబర్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె. కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ, థైరాయిడ్, పిసిఒడి వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

గనులశాఖలో కదలని ఫైళ్లు!

ఎఫ్ఎసి అప్పగింతకు ససేమిరా
3 నెలలుగా ఉద్యోగులకు జీతాలు నిలిపివేత



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డిడి) కార్యాలయ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమకూర్చడంలో మైన్స్, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. కీలకశాఖల్లో గనులశాఖ ఒకటి. గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటసాయి మూడు నెలల కిందట విఆర్ఎస్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆమోదానికి కృషి చేస్తూ డిప్యూటీ డైరెక్టర్ విధులకు గైహాజ్రైనట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌లో ఫైళ్ల క్లియరెన్స్ పేరుకుపోయింది. రాష్ట్రంలోనే ప్రముఖ ఇంజినీరింగ్ సంస్థలకు చెందిన హైవే పర్మిట్లు, తాత్కాలిక, ఇతర కంపెనీలకు సంబంధించిన పలు అనుమతులు మంజూరు ప్రక్రియ నిలిచిపోయాయి. మైనింగ్ కార్యాలయ అధికారుల కీలక బాధ్యత తనిఖీలు చేయడం. జిల్లాలో లభించే కీలక ఖనిజాలైన ఐరన్‌ఓర్, బెరైటీస్, ఇసుక, మట్టి అక్రమ రవాణా కార్యకలాపాల నిరోధానికి సంబంధించిన తనిఖీల ప్రక్రియ సైతం ఆగిపోయినట్లు తెలుస్తోంది. మైనింగ్ డిపార్టుమెంట్ క్రియాశూన్యత అక్రమార్కులకు వరంగా మారినట్లు తెలుస్తోంది. ఫలితంగా మైనింగ్‌శాఖ ద్వారా లభించే ప్రభుత్వ ఆదాయం సైతం గణనీయంగా పడిపోయియాయి. మైనింగ్ డిడి లేకపోవడంతో మూడు నెలలుగా 12 నుంచి 15 మంది ఉద్యోగులు జీతాలకు నోచుకోవడం లేదు. టెక్నికల్ స్టాఫ్, మినిస్టీరియల్ స్టాఫ్, సర్వేయర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, మైనింగ్ కార్యాలయ ఉన్నతాధి కారులు జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. జీతాల మంజూరు విషయమై రాష్ట్ర మైనింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన సంబంధిత సెక్షన్ల దృష్టికి తీసుకెళ్తే తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి జీతాలకు నోచని గనుల శాఖకు చెందిన ఉద్యోగులు జీవిత రథాన్ని ఎలా ముందుకెళ్తారో మైనింగ్ ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలు స్తంభించిన నేపథ్యంలో కలెక్టర్ గానీ, గనుల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చి పెట్టే గనులశాఖలోని సీనియర్ అధికారులకు ఫుల్ అడిషనల్ (ఎఫ్ఎసి) బాధ్యతలను అప్పగించకుండా మీనమేషాలు లెక్కించడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

2న బ్రౌన్ గ్రంథాలయానికి వెంకయ్యనాయుడు రాక

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

నవంబర్ 2న నిర్వహించే సిపి బ్రౌన్ శాస్త్రి శతజయంతోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సిపి బ్రౌన్ గ్రంథాలయానికి రానున్నారని, అందుకు సంబంధించిన ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో సిపి బ్రౌన్ ప్రాంగణంలో గ్రంథాలయ సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా స్వాగతం కాన్వాయ్, బస ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కాన్వాయ్‌లో కచ్చితంగా 108 వాహనం, మెడికల్ సిబ్బంది ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయన బసచేస్తున్న ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద మెడికల్ టీం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. శానిటేషన్ సంబంధిత అంశాలను పర్యవేక్షించాలని కడప మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం వెహికల్స్ ఏర్పాటు చేయాలని ఆర్‌టిఓను ఆదేశించారు. సాధారణ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

అధికారులందరూ జానమద్ది సాహితీ పీఠం వారితో సమన్వయం చేసుకుంటూ, ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన అన్ని ఏర్పాట్లను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెసిఅదితి సింగ్, ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఆర్‌డిఒ జాన్ ఐర్విన్, కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న దస్తగిరిరెడ్డి

జిల్లాలో మొంథా తుపాన్ ప్రభావంతో పెన్నా, కుందూ, పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతాలు, బద్వేల్ రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో వరి, అరటి, మినుము, కంది, మొక్కజొన్న, పత్తి పూలు ఇతర వాణిజ్య, ఉద్యాన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని, కురిసిన అధిక వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి వంటి పంటలు తుడిచిపెట్టుకుని పోయాయని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి తెలిపారు. గురువారం రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న, వెన్ను దశలో ఉన్న వరిపంట తుపాన్ ప్రభావంతో నేలకొరిగి వరి కంకులు నీటిలో నానుతున్నాయని పేర్కొన్నారు. వరిపంట నేలకూలటంతో యంత్రాలతో కోయటం సాధ్యపడదని తెలిపారు. దీంతో ఖర్చుపెరిగే అవకాశం ఉందని చెప్పారు. దిగుబడి సగానికి సగం తగ్గే అవకాశం ఉందన్నారు. దిగుబడి తగ్గడం, కోత ఖర్చులు పెరగడంతో వరిపంట సాగుచేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని పేర్కొన్నారు. తుపాన్ ప్రభావంతో అధికవర్షాలు, పెనుగాలుల కారణంగా పంటలు భారీగా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న అన్ని పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే పంటనష్టం గురించి అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులతో బృందాలను వేసి నిస్పక్షపాతంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించాలని చెప్పారు. జాబితాలు రూపొందించాలని పేర్కొన్నారు. పరిశీలన బృందాలలో అధికారులు, సిబ్బందితోపాటు రైతు సంఘం, కౌలు రైతుసంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. గత ప్రభుత్వంలో అనుసరించిన ఉచిత పంటల బీమా రైతులకు ఎంతగానో ఉపయోగపడిందని చెప్పారు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటలబీమా రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల భాగస్వామ్యం పేరుతో అనుసరించిన పంటలబీమా విధానం లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. రైతులకు ప్రయోజనకరంగాలేదని చెప్పారు. కనుక అన్ని పంటలకు ఉచిత పంటలబీమా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే దెబ్బతిన్న అన్ని ఆహార పంటలకు ఎకరాకు రూ.25,000, వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ. 50,000 చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతులు, కౌలు రైతులు అందరికీ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్‌సి కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని రేకులకుంట ఎస్‌సి కాలనీలో గురువారం నూతన విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా పాత స్తంభాలు, పాడైపోయిన తీగల కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. సమస్యను టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మండల మాజీ ఎంపీపీ మాలెపాటి సుబ్బారావు, మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, గమనించి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాల జారిచేశారు. విద్యుత్ శాఖ అధికారులు వేగంగా చర్యలు తీసుకొని కాలనీలో కొత్త స్తంభాలు, వైర్లు అమర్చారు. నేపథ్యంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించిందని, ఎమ్మెల్యేకి, టిడిపి నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు మధు, రాజరత్నం, దాసు, సభాపతి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - గోపవరం : మొంథా తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను వెంటనే ఆదుకోవాలని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బద్వేల్, గోపవరం మండలాల్లో తుపాన్ ప్రభావిత ప్రాంతాలను ఆమె సందర్శించారు. గుండంరాజుపల్లి, కాలువపల్లె గ్రామాల్లో వరి, మినుము పంటలు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. రెండు మండలాల్లో సుమారు 600 ఎకరాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పంట నష్టం వివరాలు వెంటనే సేకరించాలని సూచించారు. ఉచిత పంట బీమా ఎత్తివేత వల్ల 60 లక్షల మంది రైతులు నష్టపోయారని విమర్శించారు. రైతులను వెంటనే ఆదుకోవాలని, లేనిపక్షంలో వైసిపి రైతుల పక్షాన ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

75 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఎన్‌సిసి ఎంపికలు తిరుపతి 5వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికలకు కమాండ్ ఆఫీసర్ కల్నల్ అనూజ్ వార్ష్వా నాయకత్వం వహించారు. విద్యార్థులకు మార్చ్ ఫాస్ట్ చేయించారు. మొత్తం 75 మందిని విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా మాట్లాడుతూ ఎన్‌సిసికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో అనేక ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి బెటాలియన్ పిఐ స్టాఫ్ ఎం.రమేష్, జెకెజా, ఎన్‌సిసి కేర్ టేకర్ ఆఫీసర్ డాక్టర్ బి.స్వరూప, ఎన్‌సిసి కేడెట్స్ పాల్గొన్నారు.

అబూబకర్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - బద్వేలు : ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబూబకర్ మృతి ముస్లిమ్, మైనార్టీలకు తీరని లోటని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి. చాంద్‌బాషా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. అబ్దుల్ సత్తార్, ఎస్. అన్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆవాజ్ కార్యాలయంలో గురువారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో అబూబకర్ చిత్రపటానికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం మొంథా తుపాన్ కారణంగా ఆవాజ్ రాష్ట్ర నాయకులు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందడం బాధాకరమన్నారు. కర్నూలు ఉభయ జిల్లాగా ఉన్నప్పుడు నుండి ఆవాజ్ కమిటీ నాయకునిగా పనిచేస్తూ ముస్లిం ప్రజల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు కె.బి. రసూల్ .ఖాజా గౌస్, మహమ్మద్ అలీ, బాషా, మాబు, అన్వర్ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండలంలోని మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతుల పంటలను ఊటుకూరులోని అగ్రికల్చర్ రీసెట్ స్టేషన్ నుంచి సీనియర్ సైంటిస్ట్ ప్రభాకర్ రెడ్డి, పోరుమామిళ్ల ఎడిఎ మురళీధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. డి.నేలటూరు, దిశవంచ పంచాయతీలలో అధికారులు పర్యటన చేశారు. ఇప్పటివరకు 700 ఎకరాల వరి, మినుము పంటలకు నష్టం వాటినట్టుగా అధికారులు తెలిపారు. ఇంకా పరిశీలన చేస్తున్నామని చెప్పారు. నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఊటుకూరులోని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ అంకయ్య కూమర్, సునీల్ కుమార్, మఠం వ్యవసాయ అధికారి ప్రవీణ్, డి. నేలటూరు, దిరశ వంచ విలేజ్ అగ్రికల్చర్ ఆఫీరస్ లక్షిశ్వేత, గోవర్ధన్ పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ

ప్రజాశక్తి కడప అర్బన్ : టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి 3వ డివిజన్‌లో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వడ్డెర ఓబన్న విగ్రహ స్థాపనకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర ఓబన్న సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన సేవాతత్వం యువతకు మార్గదర్శకమని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉయ్యాల నరసింహారెడ్డికి సహాయకులుగా పనిచేశారని తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

ఉధృతంగా కుందూ నది.. రాకపోకలు బంద్

ప్రజాశక్తి - చాపాడు

ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుంది. నదిలో ప్రస్తుతం 45 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. దీంతో అన్నవరం, మడూరు గ్రామాల మధ్య, సీతారామాపురం - అల్లాడుపల్లె గ్రామాల మధ్య బ్రిడ్జిలు నీట మునగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేసి ప్రజలు ఎవరూ నదిలో దిగకుండా కాపలాగా ఉంచారు. గురువారం ఉదయం నుంచి నీరు క్రమేపి పెరుగుతూ వస్తుంది. కుందూనది పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు మునకకు గురవుతున్నాయి. వరి, పసుపు, ఇతర ఆరుతడి పంటలు నీటి మునిగాయి.

విచారణ పేరుతో కాలయాపన తగదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్

బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణపై విచారణ పేరుతో కాలయాపన తగదని, తక్షణమే ఆయనపై పోక్సో కింద కేసు నమోదు చేసి విధులు నుంచి సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడపలోని ఆర్‌జెడి కార్యాలయంలో ఆర్‌జెడి శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం, కందిమల్లాయపల్లె లో ఎంపిపి స్కూల్‌లో రాధాకృష్ణ అనే కీచక టీచర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన అందరికీ తెలిసిందే అన్నారు. సంఘటన వెలుగుచూసి ఆరు రోజులు అవుతున్నా అతనిపై ద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే బిడ్డలు లాంటి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. తక్షణమే కీచక ఉపాధ్యాయుడుపై పోక్సో కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేయాలని అన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు పెద్దన్న పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందు ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సామాజిక సేవలో ముందు ఉండాలని టిబిహెచ్‌ఎల్‌సి మాజీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీ షిరిడి సాయి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్ బృందం మండల పరిధిలోని ఎస్ ఉప్పలపాడులో స్పెషల్ క్యాంప్‌లో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో షిరిడి సాయి డిగ్రీ కళాశాల వాలంటీర్స్ తమ గ్రామంలో పారిశుధ్య పనులు, రోడ్లను శుభ్రం చేయటం, మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ బృందం తమ గ్రామంలో గత ఏడు రోజులు చేసిన సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులు సేవ దృక్పథంతో కలిగి ఉండటంతో పాటు దేశ అభివృధిలోనూ, సమాజ అభివృద్ధి లోనూ తోడ్పడాలని సూచించారు అనంతరం కళాశాల డైరెక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు యూనివర్సిటీ అందచేసిన సర్టిఫికెట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు గవర్నమెంట్ హైస్కూల్ హెడ్ మాస్టర్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేట్ ద్వారక నాథ రెడ్డి, డైరెక్టర్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొనారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

జెవివి రాష్ట్ర కమిటీ అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షా స్టడీ మెటీరియల్‌ను ఆర్‌జెడి శామ్యూల్, డిఇఒ షంషుద్దీన్ సంయుక్తంగా ఆర్‌జెడి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్జెడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడమే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఉద్దేశమన్నారు. స్టడీ మెటీరియల్ విద్యార్థులకు మరింత మార్గదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి విద్యా సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. డిఇఒ షంషుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పుస్తకాలను పంపిణీ చేస్తున్న జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్ నాయకులకు అభినందనలు తెలిపారు.

పరామర్శకు ముఖం చాటేసిన జగన్

- టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో విపత్తు వచ్చినా, ముందస్తుగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ప్రజలకు తానున్నానని ధైర్యం చెప్పే పరిపాలన దక్షులు చంద్రబాబు అని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లో తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తుపాన్ బాధితులను పరామర్శించడానికి తనకు విమానం లేదని ముఖం చాటేశారని విమర్శించారు. తుపాన్‌పై వైసిపి నాయకులు ఫేక్ ప్రచారాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తూ, ప్రభుత్వంపై బురదజల్లే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్క పని చేయలేదని, పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని, చేసిన అప్పులు చెల్లించే అందుకు ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని పేర్కొన్నారు. అన్ని రిజర్వాయర్లలో నీటిని నిలుపగలిగామని చెప్పారు. ఎపిలో గూగుల్ ఏర్పాటుకు జగన్ 2019లో సంతకాలు చేశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ ఆహ్వానిస్తే మరి గూగుల్ డేటా పెట్టేందుకు ఎందుకు వెనకడుగు వేసిందని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ చోరవతో సాధ్యపడిందని చెప్పారు. ప్రాజెక్టులపై అవగాహనరాహిత్యంతో జగన్ సొంత నియోజ కవర్గం లోని రిజర్వాయర్లకు కాలువలు పూర్తి చేయలేదన్నారు. రామకృష్ణ మఠం వద్ద 10 ఎకరాల్లో ఐటి పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చా యని, ఉక్కాయపల్లి వద్ద కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు కానుందని చెప్పారు. సమావేశంలో వేర్‌హౌస్ రాష్ట్ర డైరెక్టర్ మురికినాటి శ్రీధర్, టిడిపి నగర్ అధ్య క్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, రెండవ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వికలాంగురాలికి రూ.15 వేలు పింఛను ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : మండలంలోని నరసన్న పల్లె గ్రామానికి చెందిన వికలాంగురాలు ధనలక్ష్మికి రూ. 15 వేల పింఛను ఇవ్వాలని సిపిఎంమండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం వారు నరసన్నపల్లెలోని ధనలక్ష్మి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధనలక్షికి పూర్తిగా కాళ్ళు, చేతులు పనిచేయక మంచానికే పరిమితమైందన్నారు. సదరం సర్టిఫికెట్‌లో కూడా వంద శాతం ఇచ్చినా అధికారులు రూ. 15 వేలు పింఛను ఇవ్వకపోవడం దారుణమన్నారు. ధనలక్ష్మి మంచానికే పరిమితమైనా రూ. 6 వేలు మాత్రమే ఇవ్వడం శోచనీయమని వాపోయారు. పింఛను పంపిణీలో ఆర్భాటం చేస్తున్న కూటమి ప్రభుత్వం నిజమైన వికలాంగురాలకు న్యాయం చేయడంలో విఫలం చెందిందని చెప్పారు. ఆమెకు న్యాయం చేయకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ ఫెస్ట్ వాయిదా

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుఫాను ఉండడం వల్ల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30, 31న నిర్వహించాల్సిన భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ వాయిదా వేసినట్లు జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కార్యక్రమాన్ని నవంబర్ 12,13 తేదీలలో కడప నగరంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనే విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గమనించగలరని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, అఖిలేష్, మనోహర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, ఎవరూ ఆధైర్య పడకుండా ఉండాలని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందిస్తూ సంబంధితాధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి : పిఎన్ఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజానాట్యమండలి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర కన్వీనర్ సి.పి.వరలక్ష్మి, బాల చెన్నయ్య మాట్లాడుతూ కళాకారులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. కళాకారులకు సంగీత వాయిద్య పరికరాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కాంప్లెక్స్ గదులు కేటాయించాలని చెప్పారు. శిక్షణ సదుపాయాలు, వసతులు కల్పించే వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప నగరం ప్రజానాట్యమండలి కో-కన్వీనర్ సుబ్బరాయుడు, హరి కృష్ణ, సాయి ప్రియ, జిల్లా కో-కన్వీనర్ సి.పి. రమణ, సలహాదారులు అన్వేష్ పాల్గొన్నారు.

బ్రౌన్ జయంతి నిర్వహణ హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు భాషా సాహిత్యాలు ఇంత దేదీప్యమానంగా వెలుగుతున్నాయంటే దానికి మూలం సిపి బ్రౌన్ అని, అలాంటి తెలుగు భాషా సముద్ధారకుని జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని బుధవారం ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామమని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. గురువారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపి బ్రౌన్ దొర ఆంధ్ర భాషా సేవకే జన్మించాడనిపిస్తుందని పేర్కొన్నారు. శిథిలమైపోతున్న తాళపత్ర గ్రంథాలను సేకరించి, సంస్కరింపజేసి, కాగితాలపై ఎత్తి రాయించి, పాఠక భేదాలను పరిశీలించి ముద్రించిన తెలుగు వెలుగని అన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ బ్రౌన్ మహాశయుడు తెలుగు భాషపై పట్టు సాధించి ఆంధ్ర గీర్వాణ చందస్సు నేర్చుకున్నారని, చివరకు దానిపై ఒక పుస్తకమే రాయడం గొప్పవిషయమన్నారు. సమావేశంలో రాజీవ్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు మురళి, సాహితీ మిత్రులు దేవరశెట్టి గంగయ్య, యడవల్లి రామలింగయ్య, సత్యనారాయణ, ప్రకాశం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎం.ఎస్.రాజును సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న మధురెడ్డి

భగవద్గీతను అవమానించేలా మాట్లాడిన ఎం.ఎస్ రాజును వెంటనే టిటిడి బోర్డు నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ యువ నేత వెన్నపూస మధురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భగవద్గీతపై టిడిపి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎం.ఎస్. రాజు నీచమైన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. కోట్లాదిమందికి ఆదర్శనీయమైన భగవద్గీతను హేలన చేయడం దారుణమన్నారు. భగవద్గీత వల్ల ప్రజల బతుకులు మారలేదంటూ మడకశిర టిడిపి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు ఎం.ఎస్. రాజు వెటకారంగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. టిటిడి బోర్డు సభ్యులడిగా ఉంటూ ఇలా మాట్లాడడం తగదని, వెంటనే ఆయన హిందూ సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో రైల్వే పోలీస్ స్టేషన్లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని రైల్వే పోలీసులు నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులు విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, తుపాకులు, రక్షణ కోసం ఉపయోగించే పరికరాలపై డిఎస్‌పి అవగాహన కల్పించారు. పోలీసుల పనితీరు, ట్రాఫిక్ నియమాల గురించి, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ గురించి, డ్యూటీ ఆఫీస్ రూము, సిసిపుటేజ్ రూములు గురించి వారికి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల జీవితం నాశనం అవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. రైలులో ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సెంట్రల్ కిచెన్ పనులపై ఆరా తీస్తున్న డిఇఒ షంషుద్దీన్

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం : డిఇఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నిర్మాణ దశలో ఉన్న సెంట్రల్ కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ కిచెన్ షెడ్ ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనంలభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సైతం కార్పొరేట్ స్థాయిలో విద్య బోధన అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. అనంతరం మోడల్ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 ఖాదర్ బాషా, ఎంఇఒ-2 శరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ్ కన్న, పిఆర్ ఎ అర్జకేతన్‌రెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


కోటి సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

గొందిపల్లిలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వేముల

మండల పరిధిలోని స్థానిక గొందిపల్లెలో వైసిపి కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి, వేముల జడ్‌పిటిసి కోకటం వెంకటబయపు రెడ్డి, పిబిసి మాజీ సభ్యులు మరక శివకృష్ణరెడ్డి, వైసిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణను గొందిపల్లెలో చేపట్టామన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ కింద అందించే సేవలు బంద్ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ జరగకుండా ఆపేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తమ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో గొందిపల్లె సర్పంచ్ నారాయణమ్మ, దేవన రామాంజనేయులు, చల్ల వెంకటనారాయణ ,చందా మల్‌రెడ్డి, వై.భాస్కర్‌రెడ్డి, వర్ర రవీంద్రారెడ్డి, లింగాల ఆంజనేయులు, దేవన చంద్ర, కలంకుంటల సుదర్శన్ రెడ్డి, జయచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, గండికోట భూషణ, పేరం వెంకట శివ, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమాలు తప్పవని వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంతో పాటు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రయివేట్ వారికి కట్టబెడితే వైద్య విద్య పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు దూరం కాగలుగుతుందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగ అధ్యక్షులు నాగిరెడ్డి, సర్పంచులు భూమన సుబ్బారెడ్డి, రెడ్యం రామకృష్ణారెడ్డి, చంద్ర, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, అంబటి శివారెడ్డి చిన్నిరెడ్డి, లక్ష్మిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో నైపుణ్యం సాధించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో నైపుణ్యం సాధించాలని స్థానిక జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ-2 రామాంజనేయులురెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాలలో 'వృత్తి విద్యా శిక్షణ -భవితకు నిచ్చెన' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ ఇచ్చేందుకు కోర్సులను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పరికరాలను ఉపయోగించి బోధిస్తారని చెప్పారు. సమకాలీన అంశాలలోనూ విద్యార్థులకు జ్ఞానం పెంపొందించడం కోర్సు ప్రత్యేకత అని చెప్పారు. వృత్తి, వాణిజ్యం వంటి రంగాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి మార్గంగా కోర్సు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, వృత్తి విద్య సీనియర్ ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి, ఒకేషనల్ ఉపాధ్యాయులు జనార్ధన్, తేజస్వాస్, యోహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ రైతుకు విద్యుత్ షాక్

ప్రజాశక్తి- చక్రాయపేట


గాయపడిన రైతును పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

చక్రాయపేట మండలంలోని ఎర్రబొమ్మనపల్లె పంట పొలాల్లో ప్రమాదవశాత్తు వెంకట నారాయణ అనే రైతు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వివరాలు.. కుమార్వ కాల్వ గొల్లపల్లె గ్రామానికి చెందిన వెంకట నారాయణ అనే రైతు ఎర్రబొమ్మనపల్లె గ్రామంలో ఉన్న తన పొలంలో నిమ్మ పంట సాగు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు తన పొలంలో ఉన్న మోటర్ దగ్గరకు వెళ్లి మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురయ్యారు. దీంతో ఆయన కాలికి రక్త గాయమైంది. విద్యుత్ షాక్‌కు గురి అయినప్పుడు ఫీజు కట్ అవ్వడంతో ప్రాణా ప్రాయం నుండి బయట వడ్డారు. విద్యుత్ షాక్ గురి అయిన విషయం తెలుసుకున్న అప్రాంత వాసులు ప్రమాదంలో గాయపడిన రైతు వెంకట నారాయణను వెంటనే వేంపల్లె ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. . ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతును టిడిపి నేత కరీముల్లా పరామర్శించారు. ప్రథు చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప ఆసుపత్రికి తరలించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. గురువారం మేధా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలైన గంజాయి, మద్యం, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ఫేస్ బుక్, వాట్సప్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ నరసింహులు, ప్రిన్సిపల్ రాజారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పట్టణ వైద్యాధికారి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. పట్టణంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో స్వచ్ఛభారత్-సుస్థిర భారత్ కార్యక్రమాన్ని పట్టణంలోని క్రాంతి నగర్‌లో కళాశాల ప్రిన్సిపల్ త్రివిక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే విద్యార్థి దశ కీలకమని తెలిపారు. అలాగే ఇంటింటి వద్దకు వెళ్లి ప్రజలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఏడు రోజులపాటు కార్యక్రమంలో నిర్వహించి ఉన్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్- 1 ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఉంటుందన్నారు.

అరటి రైతుకు అపారనష్టం

రూ.10 లక్షల మేర నష్టపోయిన రైతు మరియమ్మ

ప్రజాశక్తి- కాశి నాయన

ఇటీవల కురిసిన వర్షం అరటి పంటకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మండల పరిధిలోని శావిశెట్టిపల్లి గ్రామం ఎంబడి మరియమ్మ, ఆమె భర్త ఎంబడి పోలయ్య తమకున్న పది ఎకరాల పొలంలో అరటిని సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయానికి మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం పూర్తిగా ముంచేసింది. బాధితుల కథనం మేరకు.. సొంత పొలంతోపాటు, మరికొంత కౌలుకు తీసుకుని సుమారు పది ఎకరాల్లో ఎకరాకు రూ. లక్ష చొప్పున ఖర్చు చేసి అరటి పంట పెట్టారు. అప్పు చేసి పంటను కాపాడుకుంటూ వచ్చారు. పంట చేతికి అందే సమయంలో మొంథా తుపాన్ వల్ల వర్షం తమ పంటను పూర్తిగా నాశనం చేసిందని వాపోయారు. చేసిన అప్పు ఎలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదని లబోదిబో మంటున్నారు. పంటకు చేతికొచ్చి చేసిన అప్పులు తీర్చుకుని మిగిలిన డబ్బులతో పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగ పడుతుందని ఎంతో ఆశపడ్డామని, ఇంతోనే వర్షం వచ్చి తమ ఆశలకు అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు కోసం బయట, బంధువల


ధ్వంసమైన అరటి పంటను చూపుతున్న రైతు మరియమ్మ

వద్ద అప్పులు చేశామని పేర్కొన్నారు. సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని, అధికారులు తమ పొలాన్ని పరిశీలించి నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. సంబంధితాధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని, లేకపోతే తమకు ఆత్మహత్య శరణ్యమని వాపోయారు.

వర్షం వస్తే ఆ పొలం చెరువే

స్పందించని రైల్వే అధికారులు న్యాయం చేయాలని రైతు వేడుకోలు


రైతు పొలంలోచేరిన నీరు

రైతు పోరెడ్డి శివాడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ల వల్ల రైతు పూర్తిగా నష్టపోతున్న సంఘటన మండలంలోని గోరిగనూరు గ్రామంలో చోటు చేసుకుంది. వర్షాకాలం వస్తే రైతుకు ఉన్న 2.5 ఎకరా పొలం మొత్తం చెరువును తలపిస్తుంది. దీంతో బాధిత రైతు ఏమీ చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గురువారం బాధిత రైతు పోరెడ్డి శివారెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ జమ్మలమడుగు మీదుగా రైల్వేమార్గం వస్తుందనడంతో రైతులు తమ పొలాలకు రైల్వేశాఖకు అప్పగించారని పేర్కొన్నారు. రైల్వేలైన్ పనుల వల్ల తమ పొలం పూర్తిగా మునిగిపోవడం బాధాకరంగా ఉందన్నారు. పంటను పండించు కోలేకపోతున్నామని వాపోయారు. వర్షం వస్తే పైనుంచి నీరు మొత్తం వచ్చి తన పొలం వద్ద స్టోరేజ్ అవుతుందని చెప్పారు. ఇదే విషయాన్ని సంబంధిత రైల్వే అధికారులకు, కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన గోడు పట్టించుకోవడంలేదని తెలిపారు. పొలంలో నీరు నిల్వ ఉండడంతో పంటలు పెట్టుకోలేక కుటుంబ జీవనం అస్తవ్యస్తంగా మారిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిల్వ ఉన్న నీటిని పోయేలా చేసి న్యాయం చేయాలని కోరారు.

వేంపల్లెలో సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు

పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీనైనా వేంపల్లెలో అందరి సహకారంతో సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రంలో ఉన్న పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించేందుకు ఏర్పాటు చేసిన ట్రై సైకిళ్లలను ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో పడకేసిన పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రతి వీధిలోని చెత్తను తరలించేందుకు ట్రై సైకిళ్లలతో పాటు చెత్త వాహనాలను పంపిస్తున్నట్లు చెప్పారు. మూలనపడ్డ ట్రై సైకిళ్లలను రిపేరి చేసి సిద్ధం చేసినట్లు తెలిపారు. ట్రై సైకిళ్లల్లో, చెత్త వాహనాల్లోనే ప్రజలు చెత్తను వేయాలని మైకులు పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మారు మూల ప్రాంతాలకు కూడ ట్రై సైకిళ్లలను చెత్త సేకరణ కోసం పంపుతున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరిస్తే సంపూర్ణ పారిశుధ్యం అనేది సాధ్యం అవుతుందని, ప్రతి ఇంటి యాజమాని చెత్తను



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి

బుట్టలో వేసుకొని వీధిల్లోకి వచ్చే చెత్త వాహనాల్లో వేయాలని కోరారు. కుక్కలను, పందులను దూర ప్రాంతాలకు తరలించామని చెప్పారు. రోడ్డుపై అడ్డంగా ఉంటున్న ఆవులనూ తరలిస్తామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని చేపట్టామన్నారు. పారిశుధ్యంపై డ్వాక్రా మహిళల్లో, విద్యార్థుల్లో చైతన్యం వచ్చేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెత్త నుండి సంపద కేంద్రాన్ని కూడా అభివృద్ధి పథంలోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

మెంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో దెబ్బతిన్న వరి, మినుము ఇతర పంటలను వ్యవసాయ శాఖ డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి దేవి పద్మలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో ముందస్తుగా వరి సాగుచేసిన రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అయ్యావారిపల్లి, రాజువారిపేట, తిమ్మాయపల్లి గ్రామాల పరిధిలో 70 ఎకరాల వరకు పంట నేలకొరిగిందన్నారు. మడూరు వద్ద 20 ఎకరాలలో పంట నేలకొరిగి ధాన్యం తడిచి మొలకలు వచ్చాయన్నారు. రబీ సీజన్‌లో సాగుచేసిన మినుము పంట దెబ్బతినిందన్నారు. వరి ధాన్యం తడిస్తే ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను గుర్తించాలని సిబ్బందికి సూచించామన్నారు. వరి పంటలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పడాలన్నారు. నీరు తొలగించడం వల్ల దోమ వృద్ధి చెందదన్నారు. నేలకొరిగిన వరి కట్టలు కట్టి నిలిచి ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న తెలుగు యువత మండల అధ్యక్షులు సుధీర్‌కుమార్‌రెడ్డి

వరద బాధితులకు అన్నదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పెద్దముడియం మండలం పాలూరు గ్రామంలో కుందూనది ప్రాంత వరద బాధితులకు పెద్ద మొడియం తెలుగు యువత మండల అధ్యక్షులు రాచుమల్ల సుధీర్‌కుమార్‌రెడ్డి గురువారం రాత్రి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ఎక్కువగా రావడం వల్ల లోతట్టు ప్రాంతాల వారు ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ఇళ్లల్లోకి నీరు చేరి ఆహారం కూడా వండుకోలేని పరిస్థితిలో దాదాపు 100 మంది ఉన్నారన్నారు. జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆదేశాల మేరకు అన్నదానం చేశామన్నారు. అన్నదానంతో పాటు బిస్కెట్లు, పండ్లు కూడా పంపిణీ చేశామని చెప్పారు. వరద బాధితులు సుధీర్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు రాచుమల్ల బాలసుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాచుమల్ల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, కుమ్మరి శ్రీనివాసులు, వెంకటేష్, గ్రామ విఆర్ఒ కృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వీరభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల


జగన్‌కు రైతు సమస్యలు విన్నవిస్తున్న వీరభాస్కర్‌రెడ్డి

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వరి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మేకల వీర భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లెలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి జమ్మలమడుగు నియోజక వర్గంలో వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలు, రైతులు సమస్యలపై వివ రించారు. ఈ సందర్భంగా వీరభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని చిన్నదండ్లూరు, గోపులాపురం, ఇల్లూరు గ్రామాలలో పంట కోత దశలో ఉండగా ఇటీవల కురిసిన వర్షం కారణంగా పూర్తిగా నేలపాలు అయిందని పేర్కొన్నారు. సుమారు 1800 ఎకరాలలో రైతులు పండించిన పంట చేతికి వచ్చిన క్రమంలో అంతా నాశనమైందని పేర్కొన్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వారిని ప్రభుత్వం ఆదుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరామని చెప్పారు.

బిపిఎస్‌పి జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మాబు, సంజీవరెడ్డి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు


మాబు, సంజీవరెడ్డి

భారతీయ ప్రజాసేవ పార్టీ జిల్లా అధ్యక్షునిగా మాబు, ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఈ సంద ర్భంగా గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ భారతీయ ప్రజాసేవ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎస్.వి. రమణారెడ్డిని నియమించినట్లు వారు తెలిపారు. సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడూ కృషి చేస్తామన్నారు. అధికారులను, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. పార్టీ అభివృద్ధికి నాయకుల సూచనలు, సలహాలు పాటిస్తూ పనిచేస్తామన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ ముందుకు సాగుతామని వారు తెలిపారు.


తాగునీటిని పరీక్షిస్తున్న అధికారులు

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని గ్రామాల్లో మంచినీటి పథకాల వద్ద నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్ తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం కారణంగా వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు అనారోగ్య బారిన పడకుండా నీటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. చాపాడు, సీతారామాపురం గ్రామాల వద్ద ఎంపిడిఒ శ్రీ కిషోర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రజలు కూడా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ఉపయోగించాలన్నారు. అన్ని గ్రామాలలో ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని పరీక్షించిన తర్వాతనే ఉపయోగించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రతను కూడా తొలగించుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో పారిశుధ్యం పనులు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేష్ బాబు, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

చెరువుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగలదిన్నె చెరువును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచెరువు, శెట్టివారిపల్లె చెరువుల్లో వరుస వర్షాల వల్ల నీరు అధికంగా ఉందన్నారు. ప్రజలు చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా ఎవరూ చెరువులలోకి దిగకూడదని తెలిపారు. పశువులను తోలడం, చిన్న పిల్లలు ఈత కొట్టడం వంటివి చేయకూడదన్నారు. లింగాలదిన్నె చెరువులో నీరు సాధారణ స్థాయిలో ఉందన్నారు. మైదుకూరు, శెట్టివారి పల్లి చెరువులు మాత్రం పూర్తిగా నిండి ఉన్నాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - ముద్దనూరు: దేశ, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరులైన పోలీసులు అమర వీరుల త్యాగాలు మరువలేనివని సిఐ దస్తగిరి పేర్కొన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో దస్తగిరి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అమరవీరులు చేసిన త్యాగాలు గుర్తు చేసుకుని సేవలను కొనియాడారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, హెచ్ఎం ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితవాడకు ట్యాంకర్‌తో నీటి సరఫరా

ప్రజాశక్తి- ఖాజీపేట : మండలంలోని పాటిమీదపల్లె దళితవాడలో కొన్ని రోజులుగా పెన్నా తాగునీటి పథకానికి సంబంధించి తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న మోటారు నీరు తాగేందుకు అనువుగా లేకపోవడంతో గ్రామ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి గురువారం స్పందించి ట్యాంకర్ ద్వారా గ్రామానికి మంచినీరు అందించారు. గ్రామంలో సమస్య పలుమార్లు ఎదురవుతుందని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపి తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ట్యాంకర్ ద్వారా మంచినీరు అందించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తపరిచారు. తాగునీటి సరఫరా విభాగ అధికారులు స్పందించి పెన్నా నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఖాజీపేట : తుపాను ప్రభావం కారణంగా పంటలను తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని సుంకేసుల తవ్వారు పల్లె, తుడమల దిన్నే గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోలకోలేని విధంగా నష్టపోయారని వారికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి జహంగీర్ పాల్గొన్నారు.


రాయితీ బుడ్డ శనగలు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం అందించే రాయితీ బుడ్డ శనగలను గురువారం రైతులకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి పంపిణీ చేశారు. అంతకుమునుపు వ్యవసాయ అధికారి ఓబులేసు మండలానికి 1400 క్వింటాలు మంజూరయ్యాయని మండలంలోని తొమ్మిది రైతు సేవా కేంద్రాల ద్వారా సుమారు 1110 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేశామని చెప్పారు. అనంతరం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అందించే పలు పథకాలను రైతులు ఎప్పటికప్పుడూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని రైతులకు సూచించారు.ార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సురేష్, విహెచ్ఎలు ఇంతియాజ్, నియాజ్, కిషోర్ నాయక్, టిడిపి నేతలు మల్లికార్జున్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రాజశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చక్రాయపేట



స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గతంలో పనిచేసిన బండి రాజశేఖర్ రెడ్డి గురువారం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదే మండల పరిషత్ కార్యాలయంలో పని చేసేవారు. గత మార్చిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అనారోగ్య కారణాలవల్ల సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి వేంపల్లి ఎంపిడిఒ కె. కులాయమ్మ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. బండి రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యం కుదుటపడడంతో జిల్లా పరిషత్ సిఇఒ ఆదేశాల మేరకు ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టారు.